హోలీ పండుగ వేళ ఉమ్మడి జిల్లాలో విషాదం నెలకొంది. వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు యువకులు, ఒక బాలుడు మృతిచెందగా మరొకరు గల్లంతయ్యారు. వెంకటాపూర్ మండలం లక్ష్మీపురం వద్ద చెట్టుకు ఢీకొని ఇద్దరు, కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామశివారులో ఆటో బోల్తాపడి ఒకరు, గణపురం మండలం చెల్పూర్‌లో రెండు బైక్‌లు ఢీకొని మరొకరు, నర్సింహులపేటలో ప్రమాదవశాత్తు చెరువులో పడి విద్యార్థి, హనుమకొండలోని పలివేల్పుల వద్ద ఎస్సారెస్పీ కాల్వలో పడి ఇద్దరు మృతిచెందారు.

– వెంకటాపూర్/నర్సింహులపేట/కమలాపూర్/గణపురం

# పండుగ పూట విషాదం

## వేర్వేరు చోట్ల ప్రమాదాల్లో ఏడుగురి మృతి, ఒకరి గల్లంతు

**చెట్టుకు బైక్ ఢీకొని ఇద్దరు యువకులు, చెరువులో పడి బాలుడు,**
**ఆటో అదుపు తప్పి ఒకరు, బైక్‌లు ఢీకొని మరొకరు, ఎస్సారెస్పీ కాల్వలో పడి ఇద్దరు..**


శనిగరపు వంశీ(ఫైల్)


ఉమ్మడి ఉమేశ్(ఫైల్)


ఎంబడి శృశాంత్ (ఫైల్)


బొట్ల రమేశ్(ఫైల్)


రిత్విక్‌రెడ్డి(ఫైల్)

వెంకటాపూర్–పాలంపేట గ్రామాల మధ్యలో లక్ష్మీపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన ఎంబడి శృశాంత్(22), తిమ్మాపూర్‌కు ఉమ్మడి ఉమేష్(22) బీటెక్ చదువుతున్నారు. వీరు హోలీ వేడుకలు జరుపుకొని బైక్‌పై రామప్ప చెరువు కాల్వలో స్నానానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో లక్ష్మీపురం(రామప్ప వెళ్లే దారిలో) వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ములుగు ఏరియా దవాఖానకు తరలించారు. అదేవిధంగా కమలాపూర్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామశివారులో ఆటో బోల్తాపడి శనిగరపు వంశీ(21) మృతి చెందాడు. సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన గంగారపు వినయ్, బొల్లం ప్రశాంత్, శనిగరపు వంశీ, శనిగరపు సాయి హోలీ సంబురాలు జరుపుకుని ఆటోలో శనిగరం గ్రామానికి వచ్చారు. తిరిగి వెళ్తుండగా గోపాల్‌పూర్ గ్రామ శివారులో ఆటో బోల్తాపడింది. దీంతో శనిగరపు వంశీ అక్కడికక్కడే మృతి చెందగా, వినయ్, ప్రశాంత్, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా, మృతుడు వంశీ హైదరాబాద్‌లో ఉంటూ, హోలీ పండుగకు చర్లపల్లికి వచ్చాడు. గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని జడల్‌పేట జీపీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన బొట్ల రమేశ్(28) తన బైక్‌పై వీరయ్యపల్లిలోని అత్తగారింటికి వస్తున్నాడు. అదే సమయంలో ధర్మారావు పేటకు చెందిన ఫొటోగ్రాఫర్ మాట్ల ప్రేమ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై చెల్పూర్‌కు వెళ్తున్న క్రమంలో చర్చి సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొట్ల రమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రేమ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రమేశ్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నర్సింహులపేట మండలంలో చెరువులో పడి బాలుడు మృతి చెందాడు. మండ లంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన అబ్బోరి వినోద్‌రెడ్డి కుమారుడు రిత్విక్‌రెడ్డి(10) మండల కేంద్రంలో 4వ తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలసి హోలీ ఆడి స్నానం చేసేందుకు గణేశ్ చెరువు వద్దకు వెళ్లాడు. రంగులు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులోని గుంతలో పడిపోయాడు. భయంతో అతని స్నేహితులు వచ్చి గ్రామంలో చెప్పడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూసే సరికి రిత్విక్ మృతి చెందాడు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు పంపి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

## ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి ఇద్దరు..

**ఒకరి గల్లంతు.. హనుమకొండలోని పలివేల్పుల సమీపంలో ఘటన**


కేదారేశ్వర్(ఫైల్)

దామెర/నయీంనగర్, మార్చి 25: హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలివేల్పుల ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి ఇద్దరు మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన తక్కెళ్ల కేదారేశ్వర్(42), ముప్పు క్రాంతికుమార్(35) కొద్దికాలంగా పలివేల్పుల వద్ద అద్దె గృహంలో ఉంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిద్దరు స్నేహితులు. హోలీ వేడుకల్లో పాల్గొన్న వీరితోపాటు కేదారేశ్వర్ పెద్దకూతురు(11), ఊరుగొండ గ్రామానికి చెందిన పండుగ భిక్షపతి పలివేల్పుల సమీపంలోని ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ వద్దకు వెళ్లారు. స్నానం కోసం కేదారేశ్వర్, కాంత్రి కుమార్ కెనాల్‌లో దిగగా నీటి ప్రవాహవేగానికి గల్లంతయ్యారు. పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలించి మృతదేహాలను వెలికితీశారు. కేదారేశ్వర్ పెద్ద కూతురు కూడా నీటిలో కొట్టుకుపోతుండగా ఆమె పక్కనే ఉన్న భిక్షపతి బయటకు లాగడంతో ప్రాణాలతో బయటపడ్డది. బాలికను చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. ఇద్దరి మృతదేహాలను ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించారు. కేదారేశ్వర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, క్రాంతికుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరి మృతితో ఊరుగొండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అదేవిధంగా కుమార్‌పల్లికి చెందిన బ్రహ్మకుమార్ హోలీ వేడుకల్లో పాల్గొని, స్నానం చేద్దామని ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి గల్లంతయ్యాడు. ఆయన కోసం పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది వెతుకుతున్నారు.

హనుమకొండ నయీంనగర్‌లో హోలీ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు



# రంగుపడింది..

## అంబరాన్నంటిన హోలీ సంబురం.. ఆటపాటలతో యువత ఉత్సాహం

## ఊరూవాడన హోరెత్తిన వేడుకలు.. కేయూ, నిట్‌లో జోరుగా..


కిషన్‌పురలో..

రంగుల సంబురం అంబరాన్నంటింది. హోలీ పండుగ సందర్భంగా ఆటపాటలతో ఉమ్మడి జిల్లా అంతటా వేడుకలతో హోరెత్తింది. సోమవారం చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ వీధుల్లోకి వచ్చి రంగులు పులుముకోవడంతో ఊరూవాడా వర్ణశోభితమైంది. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ, నిట్ సహా పలు విద్యాసంస్థల్లో సంబురాలు జోరుగా సాగాయి. విద్యార్థులు కేరింతలు కొడుతూ రంగుల్లో మునిగితేలారు. ఇలా అన్ని జిల్లాల్లో ఉత్సాహంగా హోలీని జరుపుకొన్నారు. యువత ఉత్సాహంతో స్టెప్పులేస్తూ సంబురాల్లో మునిగితేలింది.

– నమస్తే నెట్‌వర్క్, మార్చి 25


కాకతీయ యూనివర్సిటీలో కేరింతలు కొడుతున్న యువత


నిట్‌లో సెల్ఫీ దిగుతూ..


# భక్తజన కోటంచ

**పెద్ద రథంపై ఊరేగిన లక్ష్మీనరసింహస్వామి.. భారీగా తరలివచ్చిన భక్తులు**

రేగొండ, మార్చి 25 : కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పెద్ద రథంపై స్వామి వారిని ఆలయ మాడవీధుల గుండా ఊరేగించారు. ఆ తర్వాత బోనాలు, ఎడ్లబండ్లు, వాహనాల ప్రదక్షిణతో జాతర ఆరంభమైంది. గ్రామానికి చెందిన సన్నాయిల సారయ్య ఇంటి నుంచి పెద్ద బోనం, జోగయ్యపల్లెకు చెందిన కునుకుంట్ల దేవేందర్‌రావు, విజేందర్‌రావు ఇంటి నుంచి గజవాహనం తీసుకొచ్చారు. స్వామి వారి ఊరేగింపు సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భక్తులు భారీగా తరలివచ్చి రథాన్ని లాగారు. స్వామి వారికి ఇష్టమైన ప్రభబండ్లు, ఏనుగు, మేక ఆకారంతో ఉన్న బొమ్మల బండ్లు రకరకాల రంగులతో తయారు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పెద్ద రథం ఊరేగింపులో పాల్గొన్నారు. ఎన్‌సీసీ, స్వచ్ఛంద సంస్థల యువకులు సేవలందించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాగునీటి వసతులతోపాటు, మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, వైద్య, విద్యుత్‌తో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఈవో బిళ్ల శ్రీనివాస్, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్లో) లక్ష్మీనరసింహస్వామి

విద్యుత్ వెలుగుల్లో లక్ష్మీనరసింహుడి ఆలయం





# కొమ్మాల జన సంద్రం

**లక్ష్మీనర్సింహస్వామి జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు**

**గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు**

**ప్రభలు, కోలాటాల సందడి**

గీసుగొండ, మార్చి 25 : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. హోలీ వేడుకల అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఎడ్లబండ్లు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. ఒంటె, ఏనుగు, గుర్రం, మేక తదితర ప్రభబండ్లను అందంగా ముస్తాబు చేసి కోలాటాలు, లంబాడీ నృత్యాల నడుమ భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు సోమవారం రాత్రి స్వామి వారికి పూర్ణాహుతి ఇతర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ భక్తి ప్రభలు తిరిగే ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంతమంతా మార్మోగింది. దర్శనం అనంతరం భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. వరంగల్–నర్సంపేట మార్గంలో ఎడ్లబండ్ల సందడి కనిపించింది. రద్దీ దృష్ట్యా తిరుగు ప్రయాణంలో భక్తులు సూర్యతండా మీదుగా వెళ్లేలా పోలీసులు ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా, లోక్ సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని రాజకీయ ప్రభలు కట్టొద్దని పోలీసులు హెచ్చరించినా కొందరు నాయకులు రాజకీయ ప్రభలను కట్టి హల్‌చల్ చేశారు. ఒక్కో రాజకీయ ప్రభ వెనుక 200 మంది కార్యకర్తలు డీజే సౌండ్స్ పెట్టి కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. కోడ్ అమల్లో ఉండడంతో బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ ప్రభ బండ్లు కట్టడం విరమించుకున్నారు.


జాతరలో భక్తులు



## కొమ్మాల జాతరకు కాంగ్రెస్ ప్రభబండి

నల్లబెల్లి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాతరలో రాజకీయ ప్రభ బండ్లపై నిషేధం విధించినా సోమవారం రాత్రి కొమ్మాల జాతరకు కాంగ్రెస్ ప్రభబండి బయల్దేరింది. కాంగ్రెస్ జెండాలు, సీఎం రేవంత్, ఎమ్మెల్యే మాధవరెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కోడ్ ఉల్లంఘించారు.


రథంపై వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ప్రతిమలు తీసుకొస్తున్న అర్చకులు

# వైభవంగా ఎర్రగట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హసన్‌పర్తి, మార్చి 25 : ఎర్రగట్టుగుట్ట వేంకటేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హసన్‌పర్తి, భీమారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల నుంచి రథాలపై శ్రీదేవి, భూదేవీ సమేత స్వామివారి ప్రతిమలను డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఎర్రగట్టు గుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి 11.48 గంటలకు అర్చకులు వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం జాతర ప్రారంభమైంది. ఈ జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే, వివిధ గ్రామాల నుంచి భక్తులు రాత్రి ఎడ్లబండ్లతో వచ్చి గుడిచుట్టూ తిరిగి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకలు ఐదు రోజులపాటు జరుగనున్నాయి.



## మోదుగుపూల అలంకరణలో గణపేశ్వరుడు

గణపురం, మార్చి 25 : హోలీ పర్వదినం సందర్భంగా గణపేశ్వరాలయం కోటగుళ్ల గణపేశ్వరుడిని ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మోదుగుపూలతో అలంకరించారు. 12 ఏండ్లుగా ఆలయంలో ఈ ఆనవాయితీ వస్తున్నది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చిన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## 31న బీఆర్‌ఎస్ సమావేశం

వరంగల్, మార్చి 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ నెల 31న బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం జరుగనున్నది. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఈ సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.